

# కథా కౌముది

శ్రీ ప్లవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
26 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## కర్మయోగి

శ్రీధర్ రెడ్డి బిల్లా (Cupertino, CA)

"రేపు మీ నానది సంవత్సరీకం బిడ్డా ! గుడికి బోయి అయ్యగారికి దక్షిణియ్యాలె!" ఎప్పుడో బొంగురు పోయిన గొంతుతో అమ్మ అంటున్న మాటలతో టి.వి ముందు కూర్చున్నడాక్టరు రమేష్ రెడ్డికి గతమంతా ఒక్కసారి కళ్ళముందు కదలాడ సాగింది. రమేష్ రెడ్డి అమెరికాలోని ఓ స్థానిక హాస్పిటల్లో మంచి పేరు గడించిన డాక్టరు.

సుమారు ముప్పై ఏళ్ళ క్రిందట.. తాను ఇంటర్ చదువుతోన్న రోజులవి. కరీంనగర్ జిల్లా లోని ఒక మారుమూల పల్లె. తనతో పాటు ఊర్లోనే చదువుకున్న చాలా మంది పదో తరగతి తప్పి అప్పటికే ఉధృతంగా సాగుతోన్న నక్సలైట్ల ఉద్యమంలో కలిసిపోయారు.

తాను మాత్రం ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై, మండల కేంద్రంలో ఇంటర్ చదువుతున్నాడు. ఒకరోజు కాలేజీ అయిపోయాక సాయంత్రం బస్సుదిగి ఇంటికి వస్తుండగా.. దారి మధ్యలో తన పదోతరగతి క్లాసుమేటు వెంకటయ్య కలిసి ప్రక్కకు తీసుకెళ్లాడు. తనకు మాత్రమే వినబడేట్టుగా "ఏం రమేషు! అన్నలు జండాలు బాతినంక సుతం మీ నాన భూమిల అడుగుబెట్టి దున్నుతాండట నేను గూడ దళంల పనిజేత్తాన కాబట్టి జెప్తాన. కస మీ నానకు జెప్పుకో. అన్నలు జెండాలు బాతినంక సుతం ఆ భూమిలకు పోతే ఇగ గంతే! "

"ఇప్పటికే దీని మీద దళంల చానా చర్చ జరిగింది. మీ నానకు సుతం ఓ సారి వార్నింగ్ ఇచ్చిర్రు.. గి దీంట్లే నాదేతె ఏం లేదు..పైన కొంరన్న దళకమాండర్. గా అన్న ఎట్లంటె గట్లనే అయితది. ఐనా గని .. గాలి, నీళ్లు, భూమి ఒకళ సొత్తేం గాదు. సమాజంల అందరి సొత్తు. అందరికి సమానంగ బంచాలె. పంచితీరుతం. గందుకే నేను దళంల జేరిన భూసాముల దోపిడి సాగదిగ.. మీ పటేల్ గిరీలు జేసినంత కాలం జేసిర్రు..సాగినంత కాలం సాగింది.. గవన్నీ ఇగనుంచి సాగై‌___!

ఇగబోతె.. ఓ వారం కింద.. ఊరంత జూత్తాంటె.. జెండాగద్దె కాడ.. గా బాల్రెడ్డి మీద, మేం యాక్షను దీసుకుంటానం! టెలిఫోన్లు జేయబట్టే పోలీసోళ్ళకు మా గురించి తెల్తాంది.. గందుకే ఎవ్వళు గూడ ఫోన్లు పెట్టుకోద్దని ముందే సాటింపు ఏయించినంక సుతం.. ఫోన్ లైను గావాల్నని పట్నం బోయి.. అప్లికేషను పెట్టుకుండట.. గా బాల్రెడ్డి.. గందుకే వాణ్ణి జెండాకు గట్టేసి కొడతానం!

గక్కడ మీ నాన సుతం ఉన్నడు.. ఉట్టిగ జూడలె గద .. 'గిది అన్నాయం .. గట్ల గొడ్తరా..' అనెటాళకు.. కొందరు మా మీదనే తిరగబడ్డంత పనిజేసిర్రు.. మేం యాక్షన్ దీసుకుంటాంటే మీ నాన జనాలను రెచ్చగొట్టి నట్లైయింది. గక్కడ గంతమందున్నరు.. ఎవడన్నమాట్లాడిండా..? మీ నానకెందుకు?..అన్నల మీదనె తిరగబడతడా..?..మేం ఉన్నదే అందరికి నాయం జేయనీకి_ _ _. ఉన్నోడు, లేనోడని లేకుంట అందరికి సమానంగ బంచనీకి.

గది ఇగ వదిలిపెట్టు గని..జెండాలు బాతిన భూమిలకు మాత్రం బోవొద్దని జెప్పు..లేకుంటే.." చెప్పకుంటూ పోతున్నాడు.

అంతా విన్నాక, మౌనంగా నడుచుకుంటూ ఇంటికెళ్ళాడు. నాన్న ఇంట్లోనే కూర్చొని ఉన్నాడు. వెంకటయ్య చెప్పిన మాటలన్నీ నాన్నకు వివరించాక నాన్న మొదలుబెట్టాడు .

"మేమైదుగురం అన్నదమ్ములం బిడ్డా..! అందరం పంచుకోంగ నా భాగాని కొచ్చింది ఇరవై ఎకరాల భూమి_ _ _ దాంట్లె పదియేను ఎకరాలు జెండాలు పాతిర్రు.. మంచిగా ఏపు కొచ్చిన పత్తి.. ఇప్పుడొచ్చిబెదిరితార్రు..పత్తి బుగ్గలు ఏరొద్దట.. ఎవడో పోయి లేనిపోనియి ఎక్కిచ్చి జెప్తె .. ఆళ్ళు మన భూమిలకే మనల్ని పోవొద్దంటే భయపడతార్ర?.. గీ భయపడుకుంట బతుకుడు గూడ.. ఓ బతుకేనార..? గందుకే ఊళ్లె జెండాలు బాతిన భూములోళ్ళందరికి దైర్యం జెప్తాన_ _ _!" చెప్పుకుంటూ పోతున్న నాన్న మాటలకు ఏమీ ఎదురు చెప్పలేదు.

అంతా వింటున్న అమ్మ.. "వాళ్ళతోని బెట్టుకోవద్దని ఎంత జెప్పినా మీ నాన ఇంటలేదు బిడ్డా.! గీ భూమి పాడుగాను! మనలాంటోళ్ళు చాన మంది పట్నం పోయిర్రు. ఏదో ఒకటి జేసుకొని బతుకుతార్రు . మనం కూడా ఏడికైనా బోదాం..పా.. అంటాంటె.. మీ నాన వింటలేదు బిడ్డా.. ఏమన్నైతే ఇంకేమన్న ఉన్నదా ఇగ.. నువ్వు, ఇద్దరు చెల్లెళ్ళు, అందరం..ఆగమైపోతం బిడ్డా..ఆళ్ళు పిడాత పాణం దీశే రకాలు.."అంటూ కన్నీళ్లు కొంగుతో తుడుచుకుంటోంది!

నాలుగు రోజుల తర్వాత , ఓ రోజు రాత్రి పదకొండు దాటిందనుకుంటా.. చినుకులు పడుతూ ఉన్నాయి. తలుపు నెట్టుకుంటూ వచ్చాడో మనిషి. ఇంకో నలుగురు తలుపు బైటే ఉండిపోయారు. తలుపు బయట ఉన్నవాళ్లలో ఒకడు వెంకటయ్య.

లోపలికి వచ్చిన మనిషి, బల్ల మీద కూర్చొన్నాక తన పిస్తోలును బొడ్లో నుంచి తీసి బల్లమీద పక్కనే పెట్టుకున్నాడు. నాన్నను కూడా కూర్చోమన్నాడు. "నా పేరు కొంరన్న! వినే ఉంటవు గనీ.. మండల దళ కమిటీకి కమాండరును. మా మీదనే తిరుగబడమని వూళ్ళె రెచ్చగొడ్తానవు గద? భూమి నేవన్న.. పుట్టినప్పుడు నీ పేరు మీద రాసుకొచ్చినవా? జెండాలు బాతిన భూమిలకు పోనీకి నీకెంత దైర్యం?"

నాన్న బదులు చెప్తూ, "కష్టపడి సంపాదించేటోనికి.. తిని కూసునేటోనికి సమానంగ బంచుతె నడుత్తదా..? పట్నంల బొచ్చెడు మంది దగ్గర బొచ్చెడు పైసల్ ఉన్నై! గవన్ని గూడ పంచుతర మరి?........" కొంరన్న మధ్యలోనే ఆపి "ఏమో బాగ మాట్లాడుతనవూ? బైటికి పా జెండా గద్దె కాడికి. ..అక్కడ మాట్లాడదం పా..!" అంటూ నాన్నని బయటకు తీసుకుపోతున్నారు.

అమ్మ ఏడుస్తూ, "అన్నా!. నేను జెప్పుకుంట అన్న.. ఆయనతోటి ! ఈ ఒక్కసారికి వొదిలేయిర్రన్నా... మేమే ఏడికైన బోయి బతుకుతుకమన్న!.. ముగ్గురు పిలగాండ్లు , నేను దిక్కులేనోల్లం అయిపోతమన్నా..!" అంటూ కాళ్ళు పట్టుకొని బతిలాడుతోంది.. తనతో, ఇద్దరు చెల్లెళ్లతో దండాలు పెట్టిస్తోంది..

“లేదక్కా! ఏం జేయం గనీ.. కొంచెం మాట్లాడి పంపిత్తం.. గంతే.! మీరు లోపలికి పోండ్రి!” అంటూ నాన్నని బయటకు తీసుకెళ్లారు ఐదుగురు కలిసి.

అన్నలు.. జెండా గద్దె కాడ నాన్నను కాల్చి చంపేసి... “ఎవరు ఎదురు తిరిగినా గిదే గతి...” అంటూ హెచ్చరించారన్న మాట విని అమ్మ కుప్పకూలిపోయింది.

నాన్న కాష్టం చుట్టు తిరుగుతూ..ఆ ఐదుగురినీ చంపేదాక తల వెంట్రికలు, గడ్డం తీయనని బాబాయ్ శపథం జేసినట్టు ఊరంతా అనుకున్నారు. అదే రోజు ఆ విషయం అమ్మకు తెలిసి.. బాబాయిని గుంజుకొచ్చి.. వాళ్ళ జోలికి అసలే పోనని పిల్లలందరి మీద ప్రమాణం చేయమని పట్టుబట్టింది ఏడుస్తూనే! బాబాయి పెద్ద పెద్ద బొట్లు పెట్టుకొని ఊగిపోతున్నాడు.. ఎవరికీ ఆగట్లేదు! చివరికి అమ్మే.. బాబాయి రెండుకాళ్ళ మీదపడి ఏడుస్తూ బ్రతిలాడడంతో.. పిల్లలందరి మీదా ఒట్టు వేశాడు, ‘అన్నల జోలికి వెళ్లనని’! ఇది చాలామంది చూడడంతో.. ఊర్లో అందరికీ ఈ విషయం తెలిసింది!

ఆ తర్వాత కొన్నిరోజులకు..మేనమామ వచ్చి అమ్మను,తనను,చెల్లెళ్లను తనతో పాటు వాళ్ళ ఊరికి తీసుకుపోయి తన ఇంట్లోనే ఉంచుకొన్నాడు. ఎన్నేండ్ల పాటు ఏడ్చి ఏడ్చి అమ్మ గొంతు బొంగురు పోయిందో..!

ఓ నాలుగేళ్ల తర్వాత.. ఓ రోజు పేపరులో చూశాడు.. కొంరన్న దళంలో అందరూ..ఊరి చెరువుగట్టు మీద పోలీసుల ఎన్ కౌంటర్లో చనిపోయారు. కానీ కొంరన్న తప్పించుకున్నాడు.

అదే రోజు మామయ్య అమ్మతో మాట్లాడుతుండగా విన్నాడు. “అక్కా! పోలీసులల్ల ఓ పెద్ద చెయ్యికి, లచ్చ రూపాయలిచ్చినం గదా! ఎంకౌంటర్ల అందర్ని లేపేశిర్రు గని...ఒక్కడు..అసలోడే.. తప్పిచ్చుకున్నడట...ఇంకా వెతుకుతాౘ్రట.. కానీ వాని ఫోటువ ఎవరి దగ్గర లేదట! ఎట్లుంటడో .. ఎక్కడుంటాడో గూడ తెల్వదట! ఏడిదాంక బోతడో సూద్దాం..!”

కొన్నేళ్ళకు చెల్లెళ్ళపెళ్లిళ్లు చెయ్యటం..తాను ఎం.బి.బి.స్, ఎం.డి చదివి..అమెరికాకు వచ్చి స్థిరపడటం, మంచి డాక్టరుగా పేరు తెచ్చుకోటం, అమ్మకు కూడా గ్రీన్ కార్డు రావటంతో తమతో పాటే ఉండటం.. అన్నీ మననం చేసుకుంటుండగ ఇంతలోనే హాస్పిటల్ నుంచి ఫోను..ఒక ఎమర్జెన్సీ కేసు కోసం వెంటనే రావాలని..

కారేసుకొని బయలుదేరి హాస్పిటల్ వెళ్ళాడు. ఎమర్జెన్సీ రూము బయట ఓ కుర్రాడు కూర్చొనున్నాడు. ముప్పై ఏళ్ళు ఉంటాయేమో.. తెలుగోని లాగే ఉన్నాడు.. చూడగానే లేచి నిల్చున్నాడు. పక్కనే అతని తల్లి అనుకుంటా..చేతులు జోడిస్తోంది కాపాడమన్నట్టుగా.

బహుశా పేషంటు...కుర్రోని తండ్రి అయి ఉంటాడని అనుకున్నాడు. డ్యూటీ నర్సు ఇచ్చిన ఫారంలో పేషంటు పేరు “నాగేశ్వర్ రావు” వయసు డెబ్బై ఐదు సంవత్సరాలు, చిరునామా వైజాగ్ అని ఉంది.

రెండుగంటల శ్రమ తర్వాత పేషంటు స్పృహలోకి వచ్చాడు. కళ్ళు తెరుచి నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. ఇక బయటకొచ్చి “ఏం పర్లేదు! ఇప్పుడిక అంతా బాగానే ఉంది. ఇపుడు మాట్లాడుతున్నాడు. రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేయొచ్చు! మీరు కూడా లోపలికొచ్చి చూడొచ్చు.” అంటూ కుర్రోణ్ణి, వాళ్ళ అమ్మను ఎమర్జెన్సీ రూము లోపలికి తీసుకెళ్లాడు.

ఓ అరగంట అక్కడే ఉన్న తర్వాత, “ నేనిక వెళ్తాను. నర్సు, డ్యూటీ డాక్టరు వాళ్ళు చూసుకుంటారు, అవసరమైతే నన్ను పిలుస్తారు..నౌ హి ఈజ్ ఫైన్..” అంటూ బయటకు నడుస్తుండగా.. వాళ్ళ అమ్మ దండాలు పెడుతూనే ఉంది.

బయటకెళ్ళడానికి డోరు తెరిచేటప్పుడు ఓసారి పిలిచాడు. “కొంరన్నా..!”... ఆ పిలుపు విన్నాక తలతిప్పి తననే చూస్తున్నాడు పేషంటు! కుర్రోనికి, వాళ్ళ అమ్మకు ఏమీ అర్థం కాలేదు!

ముప్పైఏళ్ళ కింద ఆరోజు రాత్రి చూసిన అతని ముఖం. అమ్మ,తనూ,చెల్లెళ్ళు దండాలు పెడుతూ చూసినప్పటి ముఖం..ఇప్పుడు కొంత మారిపోయినా, ఆపరేషను చేస్తున్నపుడు తనకొచ్చిన అనుమానం ఇప్పుడు నిజమైంది!

తిరిగి కారులో ఇంటికి బయలుదేరాడు. కారు స్పీకరులో పరమాత్ముని శ్లోకం.. "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన..మా కర్మఫలహేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి.." శ్రావ్యంగా ఘంటశాల గొంతులో మోగుతోంటే, తన్మయత్వంతో రెండు కన్నీటి చుక్కలు రాలాయి.

ఇంటికొచ్చి స్నానం చేసి టి.వి ముందు సోఫాలో కూర్చున్నాడు. అమ్మ వచ్చి పక్కనే కూర్చున్నది. "రేపు మీ నాన మాష్కం గద బిడ్డా.. మీ బాబాయి ఫోన్ జేసి మాట్లాడిందు. నీ పేరు మీద భూమి పాసుబుక్కులు తెప్పిచ్చిండట. ఇంకేదో కౌల విషయం గూడ మాట్లాడాలన్నాడు.

మీ మావయ్య గూడ ఫోన్ జేసిండు. ఆ ఎన్ కౌంటర్ల దప్పిచ్చుకున్నోడు ఏడికి బోయిండో, వాళ్ళ ఊరోళ్లకు , వాళ్ళ సుట్టాలకు గూడ తెల్వదట.. ఒక్కసారి గూడ ఊళ్ళెకు రాలేదట.. వాళ్ళ అవ్వ, అయ్య సచ్చినప్పుడు గూడ ఊళ్ళెకు రాలేదట.. ఏడికి పారిపోయిండో... ఎంతెతికినా దొరకకపాయె! అనుకుంట బాధపడ్డడు...." కన్నీళ్లను కొంగుతో అద్దుకుంటూ చెప్పుకుంటూ పోతోంది.

అమ్మ చెప్తున్నదంతా వినీ.. విననట్టుగానే, టి.వి.చూస్తుండిపోయాడా... 'నిష్కామ కర్మయోగి'!

***